ఆరోగ్యానికి జిమ్‌దాబాద్

- ఓపెన్ జిమ్‌లతో అందరూ వ్యాయామం చేసుకునే అవకాశం
- సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు


బృందావన్ పార్కులో జిమ్ పరికరాలపై వ్యాయామం


వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకింగ్ చేస్తున్న వాకర్స్

మురళీనగర్ : ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగింది. ఉదయం, సాయంత్రం నడక ప్రతి ఒక్కరి జీవన వేదంగా మారింది. నడకతోపాటు వ్యాయామం చేయాలనే తపన అందరిలోనూ కనిపిస్తోంది. గతంలో వ్యాయామం చేయాలంటే ప్రత్యేకంగా జిమ్‌లకు వెళ్లాల్సి వచ్చేది. ఇందుకు కొంత ఖర్చయ్యేది. ప్రస్తుతం అందుకు భిన్నంగా జీవీఎంసీ ఓపెన్ జిమ్‌లను పార్కుల్లో ఏర్పాటు చేయడంతో ప్రజల కోరిక తీరింది. ఖరీదైన పరికరాలు అన్ని వయసుల వారికి అందుబాటులోకి వచ్చాయి. వయసుతో నిమిత్తం లేకకుండా పార్కులో సందర్శకులు, వాకర్స్ తమ ఫిజికల్ ఫిట్‌నెస్‌కు అనుకూలమైన పరికరాలను వినియోగించుకుంటున్నారు.

స్థలం ఉంటే పరికరాల ఏర్పాటు

జీవీఎంసీ పరిధిలోని కాలనీల్లో స్థలం ఉంటే చాలు జిమ్ పరికరాలు ఏర్పాటు చేయడానికి జీవీఎంసీ సిద్ధంగా ఉంది. ప్రతి పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలనే ఉన్నతాశయంలో భాగంగా గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వీటిని అందుబాటులోకి తెచ్చారు. మురళీనగర్‌లోని వాకర్స్ పార్కులో రూ.2 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయగా, వైశాఖి స్పోర్ట్స్ పార్కులో రూ.3 లక్షలతో ఓపెన్ జిమ్, ప్రశాంతి పార్కులో రూ.5 లక్షలు, బృందావన్ పార్కులో రూ.5 లక్షలు, సుదర్శన్ పార్కులో రూ.5 లక్షలు, హరిత పార్కులో రెండు విడతల్లో రూ.11లక్షలతో 11 జిమ్ పరికరాలు, ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ్ పార్కులో రూ.10 లక్షలతో జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ పార్కుల్లో వ్యాయామానికి అవసరమైన అన్ని పరికరాలూ అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ ఐరన్ కమ్ ఫైబర్‌తో, పీవీసీ మెటీరియల్‌తో తయారు చేశారు.

అందరికీ అందుబాటులో పరికరాలు


వాకర్స్ పార్కులో జిమ్ పరికరాలతో వ్యాయామం చేస్తున్న వాకర్స్

జిమ్ పరికరాలను ఔట్‌డోర్‌లో ఏర్పాటు చేయడంతో అన్ని వర్గాల వారికి వ్యాయామం చేయాలనే ఆసక్తి కలుగుతోంది. వీటిని ఫుల్‌బాడీ వర్క్ అవుట్‌కు వీలుగా రూపొందించారు. మజిల్ గ్రూప్ యువతకు ఉపయోగపడే పుల‌ప్స్, పుష‌ప్స్, లెగ్ ప్రెసెస్‌కు వీలుగా వీటిని ఉపయోగించుకోవచ్చు. ఈ పరికరాల ఏర్పాటుతో ఆరోగ్యకర జీవనం, ప్రజా సంబంధాలు పెరిగాయనే చెప్పవచ్చు. అన్ని వయసుల వారికి ఇవి ఉపయోగకరంగా ఉంటున్నాయి. అందరికీ అందుబాటులో వ్యాయామ పరికరాలు అనే ఆశయాన్ని నెరవేరుస్తున్నాయి. వాకర్స్, సందర్శకుల ఫిజికల్ ఫిట్‌నెస్‌కు అనుగుణంగా వారికి అవసరమైన పరికరాలను ఉపయోగించుకుంటున్నారు. పార్కుల్లో పిల్లలకు ఉపయోగపడే విధంగా ఆట పరికరాలు అందుబాటులో ఉన్నాయి. స్వింగ్స్ (ఊయలలు), సీ - సాస్, స్లైడర్స్ (జారుడుబల్లలు), స్పిన్నర్ అండ్ మెర్రీ గో రౌండ్, క్లైంబర్స్ వంటివి అందుబాటులో ఉన్నాయి.

సామాన్యులకూ అందుబాటులో...



జిమ్ పరికరాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఆలోచన గొప్పది. గతంలో డబ్బులున్న వారే జిమ్‌కు వెళ్లగలిగేవారు. ప్రస్తుతం పేద వారు కూడా జిమ్ చేయడానికి అవకాశం కలిగింది. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, జిమ్‌కు వెళ్లేవారు కాదు. ఇప్పుడు వారంతా వ్యాయామం చేయడానికి పార్కులకు వస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి జిమ్ పరికరాలు ఏర్పాటు చేసి ప్రజలందరికి అందుబాటులోకి తేవడం హర్షణీయం.

– పెంటకోట శ్రీనివాసరావు, మురళీనగర్

ఆరోగ్య స్పృహ పెరిగింది



ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగి అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటున్నారు. వాకింగ్‌తోపాటు వ్యాయామం ఒకేచోట చేయగలుగుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు జిమ్ పరికరాలు ఉపయోగించుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ఉదయం లేదా సాయంత్రం పూట కనీసం అర గంట సేపు జిమ్ పరికరాలు ఉపయోగించుకుంటున్నారు. ఉచితంగా వ్యాయామం చేసుకునే అవకాశం కలుగుతోంది.

– బాలచెన్నయ్య, ఎన్‌జీజీవోస్ కాలనీ

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార : నగరంలోని హెచ్‌టీ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ జోన్ – 1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలయ్య శాస్త్రి లే అవుట్, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మురళీనగర్ : జోన్ – 2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి రైల్వే క్వార్టర్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ మేరకు రైల్వే క్వార్టర్స్, మర్రిపాలెం మెయిన్ రోడ్డు, గవర వీధి, గొల్ల వీధి, రాణాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సీతమ్మధార : స్థానిక నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల శ్రీ మహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది శివ, తదితరులు ఏర్పాట్లు చేశారు. అర్చకులు రాజాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మ్యాన్‌హోల్ లీకుతో అవస్థలు


ఎన్జీజీవోస్ కాలనీలో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో యూజీడీ మ్యాన్‌హోల్ లీకవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో వారం రోజులుగా నివాసితులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కొండవాలు అభివృద్ధికి వినతి


జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరుతూ కార్పొరేటర్ గంకల కవిత జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. కొండవాలులో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం, శానిటరీ కార్యాలయం పనులు వేగవంతంగా జరిగేటట్టు చూడాలని, రోడ్లు, కాలువలు, రక్షణ గోడలు, మెట్ల మార్గాలకు రైలింగ్, సీసీ కెమెరాలు, విద్యుత్ లైట్లు వంటివి ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. వార్డులో పర్యటించి సమస్యలు గుర్తించాలని, పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయించాలని వినతిపత్రంలో కోరారు.

సమాజ సేవతో ఆత్మసంతృప్తి


సర్టిఫికెట్లు పొందిన మహిళలతో సంస్థ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : సమాజానికి చేతనైనంత సేవ చేయడం మహా భాగ్యమని, తద్వారా ఆత్మసంతృప్తి లభిస్తుందని ధనిష్ఠ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కంభంపాటి చంద్రశేఖర గురుప్రసాద్ అన్నారు. తద్వారా సంఘ శ్రేయస్సుకు తోడ్పడిన వారిమవుతామన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో జగద్గురుపీఠం వారు గురువారం నిర్వహించిన మాస్టర్ కె.పార్వతీకుమార్ 80వ జయంత్యుత్సవ సభలో ఆయన మాట్లాడారు. దేశ విదేశాల్లో పార్వతీకుమార్ చేసిన నిస్వార్థ సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ కర్మ, జ్ఞాన, యోగ మార్గాల సమన్వయ స్వరూపమే మాస్టర్ పార్వతీకుమార్ అని ప్రశంసించారు. ఆయన బోధనలు, రచనలు అనుసరణీయమని తెలిపారు. మాస్టర్ ఈకే సేవా తత్పరతకు తార్కాణమే పార్వతీకుమార్ అని సర్కిల్ ఆఫ్ గుడ్‌విల్ కార్యదర్శి బి.రామకృష్ణరాజు తెలిపారు. అనంతరం బాలవికాస్ చిన్నారులకు దుస్తులు, వృత్తి విద్య కోర్సుల్లో ఉత్తీర్ణులైన మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బి.ఉషారాణి, దాట్ల రాధ, హోమియో సేవకులు యస్‌వీ సత్యనారాయణ, డి.కృష్ణవర్మ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంపై 24న మహా సదస్సు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమణమూర్తి, చిన్నారావు, రాజేంద్రప్రసాద్ తదితరులు

సీతంపేట : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఎన్నికలు, ప్రజా సంక్షేమం' అంశంపై ఈ నెల 24న మహా సదస్సు నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు కె.చిన్నారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తితో కలిసి మహా సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా సదస్సు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 7 వరకు రామాటాకీస్ రోడ్‌లో గల అంబేడ్కర్ భవన్‌లో జరుగుతుందని తెలిపారు. సదస్సులో ముఖ్య వక్తలుగా పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్, పూలే అంబేడ్కర్ సెంటర్ ఇంగ్లిష్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలబోయిన సుదర్శన్ ప్రసంగిస్తారని తెలిపారు. ప్రముఖ దళిత గీత రచయిత తూట విజయభాస్కర్, ప్రజా వాగ్గేయకారుడు చుక్కా రామ్ నర్సయ్య పాల్గొంటారన్నారు. అంబేడ్కర్‌వాదులు, దళితులు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

ఆర్ అండ్ బీ స్థలంలో ఆక్రమణలు


సీతమ్మధార ఆర్ అండ్ బీ స్థలంలో కట్టిన దేవాలయం


ఆర్ అండ్ బీ స్థలంలో నిర్వహిస్తున్న కారు మెకానిక్ షెడ్డు

- అటువైపు చూడని అధికారులు

సీతమ్మధార : స్థానిక రోడ్లు భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) కార్యాలయం సమీపంలో ఉన్న స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడి ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయాన్ని అనుకుని ఉన్న స్థలంలో ఒక వ్యక్తి గుడి పేరిట ఆక్రమణకు పాల్పడినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ ఆంజనేయస్వామి గుడి పేరిట స్థలం ఆక్రమించడం గమనార్హం. ప్రభుత్వ శాఖ స్థలమే అయినా సదరు వ్యక్తి ఇక్కడ దర్గాగా గుడి కట్టేశారు. ఇక్కడ పూజలు, పర్వదినాలలో హోమాలు కూడా చేస్తున్నారు. బయటి వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడుతున్నా సరే పక్కనే ఉన్న ఆర్ అండ్ బీ అసిస్టెంట్ ఇంజినీర్ పట్టించుకోకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది.

దర్జాగా కారు మెకానిక్ షెడ్ ఏర్పాటు

ఆర్ అండ్ బీ ఏఈ కార్యాలయానికి సమీపాన గల స్థలంలో కొందరు వ్యక్తులు దర్జాగా మెకానిక్ షెడ్డు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆర్ అండ్ బీ క్వార్టర్లకు సమీపంలో గల ఖాళీ స్థలంలో ఏళ్ల తరబడి మెకానిక్ షెడ్డు నిర్వహిస్తున్నారు. మొదట్లో కొన్నాళ్లు అద్దె కట్టినా, తర్వాత ఆ అద్దె కూడా కట్టడం మానేయడం గమనార్హం. ఈ షెడ్డులో కార్లకి మరమ్మతులు చేస్తుండడంతో ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో కార్లు పార్కింగ్ చేస్తున్నారు. ఒక వైపు గుడి, మరోవైపు కార్ మెకానిక్ షెడ్డు రూపంలో ఆర్ అండ్ బీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఈ ఆక్రమణల విషయమై ఆర్ అండ్ బీ అసిస్టెంట్ ఇంజినీర్ భార్గవిని 'సాక్షి' వివరణ కోరగా... గుడి పేరుతో ఇక్కడి స్థలం ఆక్రమణ విషయమై ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అలాగే కారు మెకానిక్ షెడ్డు ఆక్రమణ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

అన్నదానం వేళల మార్పు

సీతమ్మధార : స్థానిక శ్రీ మహా గణపతి, శ్రీ ప్రసన్న వేంకటేశ్వర, శ్రీ అయ్యప్ప, శ్రీ షిర్డీసాయిబాబా దేవస్థానం ఆవరణలో గురువారం నుంచి అన్నదానం వేళలు మార్చారు. ప్రతీ గురువారం ఇక్కడ భక్తులకు సాయి అన్నప్రసాదం పంపిణీ చేస్తామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. ఇక నుంచి అన్నదానం మధ్యాహ్నం 11 గంటలకు ప్రారంభమవుతుందని, మాలధారులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే


తిరుమలలో కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు గురువారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయన భార్య సీతా సుజాత, కుమార్తె శ్యామల దీపిక, అల్లుడు సునీల్ అగర్వాల్ తదితరులతో కలిసి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరుపతి యాత్ర అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా శుక్రవారం విశాఖ చేరుకుంటారు.

ఘనంగా భారత్ స్కౌట్స్ డే

సీతంపేట : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రోవర్స్ అండ్ రేంజర్స్ యూనిట్స్ ఆధ్వర్యంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వార్షికోత్సవం సందర్భంగా ఫౌండేషన్ డే, ఫ్లాగ్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పట్ల అవగాహన కల్పించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి తదితరులు 75వ వార్షికోత్సవ బాడ్జీలు స్వీకరించి విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో రోవర్స్ యూనిట్ లీడర్స్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, రేంజర్ యూనిట్ లీడర్స్ యు.గంగాభవాని, కె.స్వాతి, ఎస్.సూర్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వి.. వదిలేశారంతే..!


తవ్వి వదిలేసిన యూజీడీ మ్యాన్‌హోల్

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డులో కొన్ని చోట్ల యూజీడీ మ్యాన్‌హోల్స్‌కి ఇప్పటికీ ఫ్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురుద్వారా జంక్షన్ దరి పీ అండ్ టీ కాలనీలో కొన్ని వారాల క్రితం యూజీడీ మ్యాన్‌హోల్స్ వద్ద రోడ్డు తవ్వి కంకర కుప్పలు వేశారు. తర్వాత వారాలు గడుస్తున్నా ఫ్లాట్‌ఫారం ఏర్పాటు చేయకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా రాత్రిపూట చీకట్లో యూజీడీ మ్యాన్‌హోల్స్ కనిపించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు ఇక్కడ ఫ్లాట్‌ఫారాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారో ఎవరికీ తెలియని అయోమయం నెలకొంది. సాధారణంగా రోడ్డు వేసిన తర్వాత కొద్ది రోజులకే యూజీడీ మ్యాన్‌హోల్ చుట్టూ కంకర తొలగించి సిమెంట్‌తో ఫ్లాట్‌ఫారం ఏర్పాటు చేస్తారు. పీ అండ్ టీ కాలనీలో మాత్రం ఇప్పటి వరకు ఆ దిశగా ఏర్పాట్లు చేయలేదు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 అధికారులు స్పందించి మ్యాన్‌హోల్స్‌కి ఫ్లాటఫారాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అనధికారిక దత్తత చట్టరీత్యా నేరం


శిశుగృహలో జడ్జి శేషమ్మతో పీడీ, సిబ్బంది, తదితరులు

మర్రిపాలెం: దత్తతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అనధికారిక దత్తత చట్టపరంగా నేరమని మహిళా జడ్జి ఎం.శేషమ్మ సూచించారు. జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ దరి శ్రీరామ్ నగర్ వద్ద ఉన్న మహిళా, శిశు గృహలో గురువారం నిర్వహించిన శిశువుల సంరక్షణ దినోత్సవం కార్యక్రమంలో ఆమె, శిశు సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ శిశువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. 'కార' (సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ) గైడ్‌లైన్స్ ప్రకారం దత్తతపై అవగాహన కల్పించారు. అనధికారిక దత్తత చట్టప్రకారం నేరమన్నారు. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ నుంచి టీకాల వరకు శిశువుకు చేరేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాధ, వైద్యురాలు ఉమ, జిల్లా వైద్య శాఖ సిబ్బంది నాగేశ్వరరావు, శిశుగృహ మేనేజర్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలపై విద్యుత్ భారం


ధర్నాలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత రామారావు, తదితరులు

సీతమ్మధార : రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురుద్వారా జంక్షన్ వద్ద గల ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓట్లేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే వారిపై దీపావళి కానుక అన్న చందంగా రూ.17వేల కోట్ల భారం మోపడం అన్యాయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు అవస్థలు పడుతుంటే విద్యుత్ చార్జీల పెంపు పెనుభారంగా పరిణమించిందని దుయ్యబట్టారు. విద్యుత్ చార్జీలను తగ్గించే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు ఎస్.వెంకటరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం


విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న సహచరులు

సీతంపేట : విశ్రాంత ఉద్యోగులు కష్టసుఖాల్లో ఒకరికొకరు సాయంగా నిలవాలని పోర్టు ట్రాఫిక్ (షిప్పింగ్) విభాగం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొడవంటి సుబ్రహ్మణ్యం, వి.నరసింహమూర్తి అన్నారు. సంఘం సమావేశం గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు అవసరమైన లైఫ్ సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు ఎలా పొందాలి, వేజ్ రివిజన్ తదితర విషయాలపై చర్చించారు. త్వరలో పిక్నిక్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా 80 ఏళ్లు పైబడిన విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ముందుగా ఇటీవల మరణించిన ఇద్దరు సంఘ సభ్యులకు సంతాపం ప్రకటించారు.

బుల్లయ్య కళాశాల విద్యార్థులకు పతకాలు


విజేతలను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్, తదితరులు

సీతంపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ – 17 బాలురు, బాలికల 68వ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ చాటారు. ఈ పోటీలు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో ఇటీవల జరిగాయి. బుల్లయ్య కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని బి.శైలజ 100 మీటర్ల పరుగులో రజత పతకం, 200 మీటర్ల పరుగులో బంగారు పతకం, రిలే పరుగులో రజత పతకాలను సాధించింది. అదేవిధంగా తెనాలి హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో వెయిట్ లిఫ్టింగ్ 81 కిలోల విభాగంలో బుల్లయ్య జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్.శ్యాంకుమార్ రజత పతకం సాధించాడు. వీరిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ గురువారం అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

శబరిగిరీశుని సన్నిధికి పాదయాత్ర



మురళీనగర్ నుంచి కాలినడకన శబరిమలకు పయనమైన అయ్యప్ప మాలధారులు

మురళీనగర్ : మురళీనగర్‌కు చెందిన అయ్యప్ప స్వామి మాలధారులు కాలినడకన శబరిమలకు పయనమయ్యారు. ఈ ప్రాంతానికి చెందిన బి.శ్రీనివాసరావు, ఎస్.హరికుమార్, టి.రమేష్, వై.వెంకటరావు స్వామి మాల ధరించి శబరిగిరీశుని దర్శనానికి కాలినడకన గురువారం పయనమయ్యారు. వీరు మురళీనగర్ రామాలయం నుంచి తమ ప్రయాణాన్ని ప్రారంభించారు. మురళీనగర్ మణికంఠ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తాడేపల్లి అప్పయ్య శాస్త్రి పర్యవేక్షణలో వీరు బయలుదేరారు. డిసెంబరు 20న అయ్యప్ప ఆలయానికి చేరుకుంటారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నాగేందర్‌రావు, కోశాధికారి ఆనందరావు, ఉపాధ్యక్షుడు ఎం.వెంకన్న, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా వైన్‌షాపులు కేటాయించాలి

తాటిచెట్లపాలెం : మద్యం షాపులు కేటాయింపులో కల్లుగీత వృత్తిదారులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు కోరారు. నరసింహనగర్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ జీవో జారీ చేసే ముందు కొన్ని అంశాలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రిజర్వేషన్ ద్వారా రిటైల్ షాపులు కేటాయించిన ప్రాంతంలో నివసించే గీత వృత్తి కులస్తుల ధ్రువీకరణ పత్రాన్ని అర్హతగా పరిగణించాలని కోరారు. వైన్ షాపుల లైసెన్స్ ఫీజు రూ.10 వేల లోపు ఉండేలా చూడాలన్నారు. గీత వృత్తిదారులను ధనికులు, రాజకీయ నాయకులు భయపెట్టి, ప్రలోభపెట్టి బినామీలుగా మారకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, యాత, శ్రీశయన కులస్తులతో ఓ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. బసరమాని ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, సమ్మా గోవింద, నోట్ల శ్రీనివాసరావు, పిల్లి నూకరాజు, వనుము దేవుడు, పాలికల చలం, నోట్ల వరహాలు, పిల్లి రాజా రాఘవేంద్ర పాల్గొన్నారు.

17న క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవం


వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న విచారణ గురువులు

కంచరపాలెం: క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవాలు ఈ నెల 17న జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు విశాఖ అర్చ్ డయాసిస్ వికార్ జనరల్ రెవరెండ్ ఫాదర్ డి.బాలశౌరి, రక్షణగిరి డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ క్యాథడ్రల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 8 నుంచి 16 వరకు నవదిన ప్రార్థనలు జరగనున్నాయని వెల్లడించారు. రక్షకుని యాత్రా మహోత్సవంలో విశాఖ ప్రావిన్స్ నుంచి వెరీ రెవరెండ్ ఫాదర్ భవిరి సురేష్‌బాబు ఆంగ్లంలో పవిత్ర ఆరాధన బోధన, విశాఖ అగ్రపీఠ నూతన గురువులు, ఇతరులచే తెలుగులో సమష్టి దివ్య పూజబలి జరుగుతుందన్నారు. 17న సాయంత్రం ప్రధాన పండగలో విశాఖ అగ్రపీఠ పాలనాధికారి, ఏలూరు పీఠాధిపతులు జయరావుచే సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ నుంచి రక్షణగిరి వరకు ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు ఫాదర్ బి.వినయ్‌కుమార్, పి. ఆంథోనీ రాజ్, పీపీసీ అధ్యక్షుడు రాజేష్, సభ్యులు రత్నం, ఫ్రాన్సిస్, ఐతి రవికుమార్, విజయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.